


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 232 | ఆదివారం 24- ఆగష్టు 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

### గోదావరి కావేరి లింక్ లో

## సగం వాటా ఇవ్వాలి..

### మేం ఎక్కడైనా వాడుకుంటామన్న తెలంగాణ




**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** గోదావరి కావేరి లింక్‌లో భాగంగా తరలించే 148 టీఎంసీల జలాల్లో సగం వాటా (74 టీఎంసీలు) ఇవ్వాలని రాహుల్ బొజ్జా డిమాండ్ చేశారు. జీసీ లింక్‌ను తెలంగాణ భూభాగం నుంచే చేపడుతున్నా.. కేవలం 45 టీఎంసీలే కేటాయించారని అన్నారు. కాబట్టి రాష్ట్రంలోని కరువు ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని సగం వాటా ఇవ్వాలని కోరారు. అయితే, రాష్ట్ర విజ్ఞప్తిని ఎన్‌డబ్ల్యూడీఏ తిరస్కరించింది. సగం వాటా ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. కాగా, ఇచ్చంపల్లి నుంచి జీసీ లింక్‌ను చేపడితే.. పలు షరతులతో చేపట్టాలని రాహుల్ బొజ్జా ఎన్ డబ్ల్యూడీఏ చైర్మన్ కు సూచించారు. తొలుత తమకు గోదావరిలో కేటాయించిన 968 టీఎంసీల నీటి వినియోగానికి రక్షణ కల్పించాలన్నారు. 148 టీఎంసీల తరలింపునకు చత్తీస్‌గఢ్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు.

## క్రికెట్ బ్యాట్ కోసం వెళ్లి

## సహస్రను వెంకట్ హత్య చేశాడు



- ఓటీటీ క్రైమ్ సీన్ల ప్రభావంతో హత్యకు పాల్పడ్డ 14 ఏళ్ల బాలుడు
- నెల రోజుల ప్లాన్‌తో సహస్రను హత్య చేసిన పక్కింటి బాలుడు
- బ్యాట్ దొంగలించేందుకు వెళ్ళినపుడు బాలిక అరవడంతో కత్తితో హత్య
- హత్య తరువాత ఆధారాలు మాయం చేసిన బాలుడు, జువైనల్ హెూంకు తరలింపు – సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

## ఎవ్వరు అడ్డొచ్చినా

## 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతాం

- తెలంగాణ నగర ప్రణాళికలు దేశానికి ఆదర్శం
- భవితవ్య తరాల కోసం నీటి వనరుల సంరక్షణే లక్ష్యం
- బయోఫిలిక్ అర్బనిజం కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ఎవ్వరు అడ్డొచ్చినా.. భావి తరాల కోసం 'మూసీ' ప్రక్షాళన చేసి తీరుతామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇవాళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయాత్ హెూటల్‌లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టూవార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సౌత్ జోన్ కాన్ఫరెన్స్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

## హైదరాబాద్‌కు రండి..

### ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కి కేటీఆర్ ఆహ్వానం




**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ప్రముఖ ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తన మొదటి కార్యాలయాన్ని ఈ ఏడాదిలో ఇండియాలో ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన భారత్‌కి రాబోతున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు.

## హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** హైదరాబాద్‌లో వరదలు, మురుగునీటి సమస్యలు, చెరువుల కబ్జాలు, పర్యావరణ సమస్యలు వంటి క్లిష్ట అంశాల పరిష్కారానికి ఒక ప్రత్యేక సంస్థ అవసరమని భావించిన ప్రభుత్వం, గత ఏడాది జూలైలో హైడ్రా అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ సంస్థ పనితీరు, భవిష్యత్ దిశపై కీలక వ్యాఖ్యలు చేశారు.



## యూరియా కొరతపై

# కేటీఆర్ డ్రామాలు

- బీఆర్ఎస్–బీజేపీ కలిసి మాయాజాలం చేస్తున్నారు
- ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును ప్రకటించినందుకు రేవంత్ ధన్యవాదాలు
- బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం: స్థానిక ఎన్నికల కోసం మరో బిల్లు సిద్ధం
- బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి ఆమోదం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న తెలంగాణ ప్రభుత్వం
- యూరియా కోసం నాలుగుసార్లు కేంద్ర మంత్రులతో సమావేశమైనట్లు వెల్లడించిన సీఎం రేవంత్
- స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రుల కమిటీ ఏర్పాటు: నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో శనివారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ప్రకటించినందుకు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ పరిరక్షణ, పౌర హక్కుల కోసం పనిచేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టామని, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గం, అసెంబ్లీలో బిల్ ఆమోదించామని గుర్తు చేసారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం మరో బిల్ తెచ్చామని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన 50% రిజర్వేషన్ పరిమితి చట్టం అడ్డంకిగా మారిందని, దాన్ని సవరించేందుకు ఆర్డినెన్స్ తెచ్చామని, గవర్నర్ దానిని కేంద్రానికి పంపారని వెల్లడించారు. బీసీలకు మేలు జరగాలని, రాహుల్ గాంధీ మాట నిలబడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కేసీఆర్ చట్టం వల్ల బీసీలకు 1% రిజర్వేషన్ కూడా రాదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి 90 రోజుల్లో బిల్లులను ఆమోదించాలన్న అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశం పైన సుప్రీమ్ కోర్టు లో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని, అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందన్నారు.

## ఒక్కసారి ఆ తీర్పు చదివి ఉంటే బాగుండేది

### : అమిత్ షాకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి కౌంటర్



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి

### : మంత్రి పొన్నం




**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## పేదవాడి ఇల్లు ఐదు లక్షల్లో సాధ్యం కాదు

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యలపై మంత్రి పొంగులేటిని కలిసిన ఎంపీ ఈటల
- రాష్ట్రం మాత్రమే కాదు, కేంద్రం కూడా ఇళ్ల నిర్మాణంలో పాత్ర వహించాలి: ఈటల



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన ఆయన సమస్యలపై వివరణాత్మక చర్చ నిర్వహించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మల్కాజిగిరి ఎంపీ పరిధిలో పేదలకు కేటాయించాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

## పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా

### - హరీశ్‌రావు ధ్వజం

- రైతుల కన్నీళ్లకు , ప్రభుత్వ వైఫల్యమే కారణం
- యూరియా అడిగితే లాఠీలు
- ఎరువులపై సమీక్ష లేకుండా మిస్ వరల్డ్‌పై మక్కువ: హరీశ్ ఘాటు వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ఒకవైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలం అవుతుంటే అధికార పక్షం దాన్ని ప్రతిపక్షాల దుష్ప్రచారంగా చెప్పడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుందని మండిపడ్డారు. కుండపోత వానలో తడుస్తూ రైతులు గంటల కొద్దీ నిలబడటం అబద్ధమా అని మండిపడ్డారు.

## మా వస్తువులు కొనకండి..

### కొనమని ఎవరూ బలవంతం చేయరు

### – ట్రంప్ సుంకాలపై జైశంకర్ కౌంటర్



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు విదేశాంగ మంత్రిజైశంకర్. మీరు సుంకాలు పెంచుతూ పోతే మేం మాకేం నష్టమేమీ లేదు.. మా వస్తువులు కొనకండి.. మిమ్మల్ని మా వస్తువులు కొనమని ఎవరూ బలవంతం చేయడం లేదంటూ కౌంటర్ ఇచ్చారు జైశంకర్.

# క్రికెట్ బ్యాట్ కోసం వెళ్లి సహస్రను వెంకట్ హత్య చేశాడు

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఐదు రోజుల క్రితం జరిగిన బాలిక సహస్ర హత్య కేసును ఛేదించిన పోలీసులు ఈ కేసులో విస్తుపోయే విషయాలు వెల్లడించారు. క్రికెట్ బ్యాట్ ను దొంగిలించేందుకు వెళ్లి వస్తుండగా.. బాలిక చూసి అరవడంతో హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. ఓటీటీ ప్లాట్ ఫామ్స్ లో క్రైమ్ సీన్స్ చూసే బాలికను హత్య చేసినట్లు తేల్చారు. సహస్ర హత్య కేసులో బాలుడు సైకోలా ప్రవర్తించినట్లు అతను రాసుకున్న నోట్స్.. ప్రవర్తించిన తీరును బట్టి అర్థం అవుతుందని, పోలీసుల విచారణలో పక్కా ప్రొఫెషనల్ క్రిమినల్ గా వ్యవహరించిన బాలుడు.. హత్య చేసి ఆధారాలు మాయం చేయడం నేర్చుకున్నట్లు స్పష్టం అవుతుంది.

సంచలనం సృష్టించిన ఈ కేసుకు సంబంధించి సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి వెల్లడించారు. ఈనెల 18న ఉదయం సహస్ర హత్య జరిగిందని, ఈ కేసులో 3 రోజుల వరకు పెద్దగా క్లూస్ ఏమీ దొరకలేదని, ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. ఈ కేసులో కొంతమందిని అనుమానితులుగా గుర్తించి ఆ దిశగా విచారణ చేపట్టగా హత్య జరిగిన రోజు, ఆ ఇంటి గోడ సమీపంలో ఓ బాలుడు తచ్చాడినట్లు పక్క ఇంట్లో ఉండే బాలుడు ఇచ్చిన సమాచారంతో ఈ కేసును లోతుగా దర్యాప్తు చేపట్టమన్నారు. సహస్రను పక్క ఇంటిలో ఉన్న 14 ఏళ్ల బాలుడు మర్డర్ చేసినట్లు తేలిందన్నారు. సహస్ర ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో మృతురాలు తమ్ముడు, హత్యకు పాల్పడ్డ బాలుడు క్రికెట్ ఆడుకునే వారని, తనకు ఇవ్వమంటే ఇవ్వలేదని, స్ట్రోక్ బాగున్న ఆ బ్యాట్ ను ఎలాగైనా దొంగలించాలని అనుకున్నాడని తెలిపారు. ఇందుకోసం పక్కాగా ప్లాన్ చేసుకున్నాడని, ఎలా దొంగతనం చేయాలి, ఎవరైనా చూస్తే అక్కడి నుంచి ఎలా తప్పించుకోవాలి, క్లూస్ దొరకక కుండా ఏం చేయాలి అనేది నెల రోజుల క్రితమే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నట్లు తమ విచారణలో తేలిందని సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. అనుకున్న విధంగా ఈనెల 18న ఉదయం పక్కింటిలోని ఇంట్లోకి చొరబడి బ్యాట్ దొంగతనం చేసి తీసుకుని వస్తుండగా బాలిక సహస్ర చూడడంతో తన వెంట తీసుకువెళ్లిన కత్తితో బాలికను ఇష్టం వచ్చిన విధంగా పొడిచి చంపాడు.

అనంతరం అక్కడే మర్డర్ చేసిన కత్తిని కడిగేసి, టెర్రస్ గోడ దూకి తన ఇంటిలోకి వెళ్లి రక్తపు మరకలు అంటిన బట్టలను వాషింగ్ మెషిన్ లో వేశాడని, అనంతరం ఏమీ తెలియనట్టు మళ్లీ అదే ప్రాంతంలో ఏమీ తెలియనట్టు తిరగాడని సీపీ తెలిపారు. ఓ బాలుడి ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు చేపట్టగా దర్యాప్తును పక్కదారి పట్టించేలా లేని విషయాలు చెప్పాడన్నారు. పక్కా ఆధారాలతో ఈ కేసును ఛేదించామని అన్నారు. మర్డర్ కు పాల్పడిన చోట క్లూస్ దొరికాయని, స్క్రిప్ట్ ప్రకారమే ఇదంతా చేశాడని, నెల రోజుల నుంచి ఇదంతా ప్లాన్ చేసుకున్నాడన్నారు.

ఓటీటీలు, మిస్టరీ సినిమాలు చూసే ఇదంతా చేశాడని అన్నారు. ఈ విషయం బాలుడి తల్లిదండ్రులకు కూడా తెలియదని, మర్డర్ జరిగిన తర్వాత కాస్త భయం భయంగా ఉన్న బాలుడిని అతని తల్లి నువ్వేమైన చేశావా అని అడిగితే రెండవ రోజు నువ్వే పట్టించేలా ఉన్నావని అన్నాడని ఆమె విచారణలో తెలిపిందన్నారు.

మేము డబ్బులు ఇవ్వకుండానే ఓ ఫోన్ కొనుకున్నాడని, అదెలా వచ్చింది అంటే సమాధానం చెప్పలేదని తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు సీపీ తెలిపారు. అనంతరం బాలుడిని ప్రశ్నించడంతో నిజం అంగీకరించినట్టు తెలిపారు. బ్యాట్ కొనీయమని అడగాలంటే ఫ్యామిలీ మొత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని అందుకే దొంగతనం చేసేందుకు సిద్ధమైనట్లు బాలుడు విచారణలో వెల్లడించినట్లు సీపీ వెల్లడించారు. సహస్ర హత్య కేసులో నిందితుడైన బాలుడిని జువైనల్ హోంకు తరలించారు పోలీసులు. అంతకుముందు అతడిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

# పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా - హరీశ్‌రావు ధ్వజం

మొదటి పేజీ తరువాయి



ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. యూరియా బస్తాలు ఇవ్వాలంటూ రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకొని వేడుకున్నది అబద్ధమా? దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టించింది అబద్ధమా? కాంగ్రెస్ ఎంపీల యూరియా పోరాటం ఫలించిందని చెప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి సిగ్గనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేతగాని తనం వల్లనే కదా ఈరోజు రైతులకు ఇన్ని కష్టాలు వచ్చిందని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి ముందు చూపు లేకపోవడం వల్లనే కదా రైతులు కన్నీళ్లు పెట్టాల్సి వస్తున్నదని మండిపడ్డారు.

తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, బంగారం మాట దేవుడెరుగు యూరియానే బంగారంగా మార్చిండని హరీశ్‌రావు విమర్శించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులైపారిస్తున్న రేవంత్ రెడ్డి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిండని మండిపడ్డారు. బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదు, పరిపాలన చేయడం అంటే అని ఎద్దేవా చేశారు. నమ్మి నయవంచన చేసినంత సులువు కాదు, కేసీఆర్ అందించిన రైతు సంక్షేమాన్ని కొనసాగించడం అంటే అని పేర్కొన్నారు. నాటి రోజులు తెస్తామని పదే పదే చెప్పే రేవంత్ రెడ్డి..అన్నమాట నిలుపుకుంటున్నడని.. మల్లా కాంగ్రెస్ దుర్మార్గ పాలన నాటి పాత రోజులను తీసుకొచ్చిండని మండిపడ్డారు.తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని హరీశ్‌రావు అన్నారు. ఏనాడూ రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని గుర్తుచేశారు. యూరియా కొరతకు కారణమైన వారే ఈరోజు యూరియా పేరు చెప్పి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. మిస్ వరల్డ్ పేరిట రెండు నెలలు పాలనను గాలికి వదిలేసిండు తప్ప, ఎరువులు, విత్తనాల గురించి సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేయలేదని.. బాధ్యత లేదు, ప్రణాళిక లేదు, కార్యచరణ లేదని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నాం, బాధ్యతగా ఉండాలనే సోయి కూడా లేకుండా ప్రతి వైఫల్యాన్ని బీఆర్ఎస్, కేసీఆర్ పై వేస్తూ రంకెలేయడం తప్ప 22 పాలనలో ఒరగబెట్టిందేమిటి అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేతగాని తనం వల్లనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఈరోజు యావత్ రైతాంగాన్ని యూరియా కోసం నడి రోడ్డుపై నిలబెట్టిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది సాగు నీళ్లు ఇవ్వడంలో ఫెయిల్, పంట కొనుగోళ్లలో ఫెయిల్, 500 బోనస్ ఇవ్వడంలో ఫెయిల్, రైతు భరోసా ఇవ్వడంలో ఫెయిల్, రైతు రుణమాఫీలో ఫెయిల్, చివరకు యూరియా సరఫరా చేయడంలో ఫెయిల్ అని విమర్శించారు. రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్న ఈ ప్రభుత్వం ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వమని మండిపడ్డారు.

దేశానికి అన్నం పెట్టే రైతుల చేతులతో కాళ్లు మొక్కించుకుంటున్న ఈ ప్రభుత్వానికి తప్పకుండా ఉసురు తగులుతుందని అన్నారు. రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మీద నిందలు మాని, రైతుల యూరియా కష్టాలపై ఇప్పటికైనా దృష్టి సారించాలని హితవు పలికారు. యూరియా, ఎరువుల కొరత పై సమీక్ష నిర్వహించి, రైతాంగానికి అవసరమైన యూరియా వెంటనే సరఫరా చేయాలని బీఆర్ఎస్ పక్షాన

# యూరియా కొరతపై కేటీఆర్ డ్రామాలు - సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 26న బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ఓట్ చోరీ పాదయాత్రలో పాల్గొంటానని సీఎం పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి యూరియా కొరతపై డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. కేటీఆర్ యూరియా ఇచ్చే పార్టీకి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిస్తాననడం వారి ద్వంద వైఖరి బయటపడిందని విమర్శించారు. యూరియా కోసం నాలుగుసార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్‌ను కలిశానని తెలిపిన సీఎం... యూరియా పంపిణీపై క్షేత్రస్థాయిలో మానిటరింగ్ పెంచాలని సూచించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై నలుగురు మంత్రులతో కూడిన కమిటీని వేస్తున్నట్టు పేర్కొన్నారు. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా కేబినెట్ లో చర్చించి స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి: మంత్రి పొన్నం

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో 6 వేల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లు గుర్తించారు. అధికార పార్టీకి అవకాశమిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రతి బూత్‌కు ఒకరు ఇన్‌ఛార్జిగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకూడదని సూచించారు. నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇన్‌ఛార్జి ఉపాధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు ప్రభావవంతంగా పని చేయాలని తెలిపారు. డివిజన్లలో కార్యాలయాలు ప్రారంభించుకోవాలని.. బూత్‌వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రభుత్వ పథకాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ పాల్గొన్నారు.

# హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు

మొదటి పేజీ తరువాయి



హైడ్రా ఏర్పాటు తర్వాత ప్రభుత్వమే జిహెచ్ఎంసి యాక్ట్‌లో మార్పులు చేసి సంబంధిత అధికారాలు కల్పించిందని కమిషనర్ తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరిస్తున్నారని చెప్పారు.

వరదల్లో మురుగు నీరు సమస్యలను పరిష్కరించడం, అకాల వర్షాల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ, చెరువులు–నాలాలను రక్షించడం హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ చెప్పారు. “నాలాల్లో వేలాది ట్రక్కుల పూడికతీత పనులు చేశాం. సిబ్బంది చేతనే మ్యాన్‌హోల్స్, నాలాలు క్లీన్ చేయించాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో కొన్ని ఫోర్కాస్ట్ ఇబ్బందులు ఉన్నా, ఇప్పుడే చేస్తున్న పనులు వచ్చే 100 ఏళ్లకు ఉపయోగపడతాయి” అని పేర్కొన్నారు. “60–65 శాతం చెరువులు మాయం అయ్యాయి. పొల్యూషన్ వల్ల అనేక సమస్యలు వచ్చాయి. వాటిని అడ్డుకోవాలి. CSR పేరుతో చెరువులు కొట్టేయాలని చూస్తే ఊరుకోం. చెరువుల మాదిరిగా నాలాలను కూడా నోటిఫై చేసి కబ్జాలను నిరోధిస్తాం” అని హెచ్చరించారు.

అలాగే, బతుకమ్మ కుంట, కూకట్పల్లి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత స్థానికులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. హైడ్రా ఏర్పడి సంవత్సరం పూర్తయిందని, ఈ కాలంలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని కమిషనర్ తెలిపారు. “తక్కువ మ్యాన్‌పవర్‌తో ఎక్కువ ప్రొడక్టివిటీ సాధించాం. ఇప్పటి వరకు 500 ఎకరాలను కాపాడగలిగాము” అని గర్వంగా చెప్పారు.

# పేదవాడి ఇల్లు ఐదు లక్షల్లో సాధ్యం కాదు

మొదటి పేజీ తరువాయి

గతంలో తప్పిపోయిన పేదల జాబితాను మంత్రి పొంగులేటికి అందించినప్పటికీ, ఇప్పటివరకు కేటాయింపులు సక్రమంగా జరిగేవి లేవని, అలాట్మెంట్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో భూములు దొంగల పుటకు చేరుతున్నాయని చెప్పారు.

అలాగే, ఐదు లక్షల రూపాయలతో పేదవాడు ఇల్లు కట్టే పరిస్థితి కుదరదని, నిజానికి కనీసం 12 లక్షలుగా ఖర్చు ఉంటుందని ఈటల రాజేందర్ వివరించారు. జవహర్ నగర్‌లో ఉన్న భూములు ప్రభుత్వానికి సంబంధం లేకుండా, మాజీ డిఫెన్స్ అధికారులకు కేటాయించబడినందుకు విమర్శలు వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఉన్న ఇండ్లను కూల్చడం కరెక్ట్ కాదని, 60–80 గజాల భూముల్లో ఇళ్ళు నిర్మించినవారు కటిక పేదలే కాక ధనవంతులైనవారే కాదని అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును కలిసే అవకాశం లేకపోవడంతో డిఆర్సీ సమావేశం ఏర్పాటు చేయలేకపోవడంపై బాధ వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నేరుగా సహకరించకపోవడం, అవసరమైతే కేంద్రంతో చర్చలు చేస్తామనే వైపు ఆయన వెల్లడించారు. కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారాల్లో నియమాలు, బాధ్యతలపై కూడా ఈటల రాజేందర్ స్పష్టత ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గూర్చి, కేంద్రంపై మాత్రమే ఒత్తిడి చూపడం సరైనదా కాదని పేర్కొన్నారు. అంతేకాక, ఈటల రాజేందర్ ఉప రాష్ట్రపతి అభ్యర్థి కోసం పార్టీలు ఓట్ల కోసం అభ్యర్థన చేయాలని సూచించారు. ఈ భేటీ, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించడానికి కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకునే దిశగా ముందడుగు కాగలదనే దృక్పథాన్ని ప్రసారం చేస్తుంది.

# గోదావరి కావేరి లింక్ లో సగం వాటా ఇవ్వాలి.. మేం ఎక్కడైనా వాడుకుంటామన్న తెలంగాణ

మొదటి పేజీ తరువాయి




జీసీ లింక్ తో దేవాదుల లిఫ్ట్ లో 38.16 టీఎంసీలు, సమ్మక్కసాగర్ లో 46.96 టీఎంసీలు, సీతమ్మసాగర్– సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టుల్లో 67.05 టీఎంసీలు కలిపి 152.17 టీఎంసీల నీటి వినియోగానికి ఎలాంటి అడ్డంకులు ఉండకుండా చూడాలని, వాటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే సమ్మక్కసాగర్ ప్రాజెక్టుపై ప్రభావం పడకుండా చూడాలని, అందుకు అనుగుణంగా గేట్ ఆపరేషన్ ప్రొటోకాల్ షెడ్యూల్‌పై సిమ్యులేషన్ స్టడీస్ చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రానికి జీసీ లింక్‌లో ఇచ్చే వాటాతో పాటు రాష్ట్రంలోని కరువు ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించేందుకు 200 టీఎంసీలు ఇచ్చంపల్లి నుంచి వాడుకునేలా అనుమతి ఇవ్వాలని కోరారు.

ఎక్కడైనా వాడుకుంటం..


తెలంగాణ కోటా కింద ఇచ్చే నీళ్లను శ్రీరాంసాగర్ లేదా దేవాదుల ఆయకట్టు స్థిరీకరణకు వాడుకోవాలన్న రూల్స్‌ను ఎన్‌డబ్ల్యూడీఏ పెడుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర సర్కారు అందుకు అంగీకరించలేదు. ఆ నీటిని రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునేలా తమకు స్వేచ్ఛనివ్వాలని రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. జీసీ లింక్‌లో భాగంగా కృష్ణా బేసిన్‌లో అవసరమున్న చోట రెండు రిజర్వాయర్లను కట్టివ్వాలని, ఆయా రిజర్వాయర్లకు నీటి తరలింపు వ్యవస్థలను నిర్మించాలని కోరారు. జీసీ లింక్‌లో భాగంగా సాగర్‌కు నీటిని తరలించే కన్వేయర్ సిస్టమ్?లో చాలా వరకు వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని, ఆ ముంపును తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

తరలించే నీటిని నేరుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి తీసుకెళ్లవద్దని, సాగర్ టెయిల్ పాండ్‌కు తరలించి అక్కడి నుంచి తీసుకెళ్లాలని సూచించారు. సాగర్‌లోకి నీటిని తరలిస్తున్నందున అక్కడ రీప్లేస్‌మెంట్‌కు బదులుగా కర్నాటకకు ఆల్మట్టిలో అదనంగా 16 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారని, దాని వల్ల తెలంగాణకు గేట్‌వే ప్రాజెక్ట్ అయిన జూరాలకు ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాగర్ నుంచి రీప్లేస్‌మెంట్ అన్నారే తప్ప ఎలా అనే వివరాలను మాత్రం చెప్పలేదన్నారు. ఈ నిర్ణయంపై పునఃసమీక్షించాలన్నారు. అన్ని రాష్ట్రాలూ సమ్మతించాకనే మెమోరాండమ్ ఆఫ్ అగ్రిమెంట్‌పై ముందుకు వెళ్లాలని, ఇప్పుడే చేస్తే అది తొందరపాటే అవుతుందని స్పష్టం చేశారు.

# ఎవ్వరు అడ్డొచ్చినా ‘మూసీ’ ప్రక్షాళన చేసి తీరుతాం

**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరూ కావాలనే అడ్డుపడుతుంటారని కామెంట్ చేశారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన విషయంలోనూ ఇదే జరుగుతోందని అన్నారు. కానీ, భావి తరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతామని, ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్‌గా నిలుపుతామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమని అన్నారు. నేడు మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి – ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ – న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయవచ్చిన స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీపీఐ ప్రెసిడెంట్ ఎన్‌కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో–ఆర్డినేటర్ (టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీపీఐ – తెలంగాణ రీజినల్ ఛాప్టర్ చైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# మా వస్తువులు కొనకండి.. కొనమని ఎవరూ బలవంతం చేయరు..



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు విదేశాంగ మంత్రిజైశంకర్. మీరు సుంకాలు పెంచుతూ పోతే మేం మాకేం నష్టమేమీ లేదు.. మా వస్తువులు కొనకండి.. మిమ్మల్ని మా వస్తువులు కొనమని ఎవరూ బలవంతం చేయడం లేదంటూ కౌంటర్ ఇచ్చారు జైశంకర్. ఢిల్లీలో జరిగిన ఎకనామిక్స్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం 2025లో ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జైశంకర్.. రష్యానుంచి చమురు ఇతర ఉత్పత్తులు భారత్ దిగుమతి చేసుకుంటే మీకేం నష్టం.. మీకేదైన సమస్య ఉంటే కొనకండి.. ఎవరూ మిమ్మల్ని కొనమని బలవంతం చేయరు అని అన్నారు. అమెరికాతో వ్యాపారం చేసేవారు ఇతరులతో వ్యాపారం చేయకూడదని చెప్పడం సరికాదన్నారు. మాకు మా రైతుల ప్రయోజనాలు, కింది స్థాయి ఉత్పత్తిదారుల ప్రయోజనాలు ముఖ్యం.. వాటిని కాపాడుకునేందుకు మేం కట్టుబడి ఉన్నామని జైశంకర్ అన్నారు. రైతు ప్రయోజనాల విషయంతో రాజీపడం అని తేల్చి చెప్పారు. రష్యానుంచి చమురు కొనుగోలు విషయంలో చైనా , ఈయూ, ఇతర దేశాలు కూడా ఇలాంటి సంబంధాలు కలిగి ఉన్నాయి. అయినప్పటికీ వాటికి సుంకాలు పెంచలేదని స్పష్టం చేశారు.

అమెరికా భారత్ ను వేరు చేస్తుందా?

అమెరికా పక్షపాత ధోరణిని అమలు చేస్తుందని జైశంకర్ ఆరోపించారు. చైనా పెద్ద ఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంది. అయిన వాణిజ్య పరమైన సుంకాలు లేవని జైశంకర్ అన్నారు. భారత్ చమురు కొనుగోలు ప్రపంచ మార్కెట్ విధానాలు, అవసరాలకు అనుగుణంగా ఉంది.. ప్రపంచ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు రష్యానుంచి చమురు కొనుగోలును గతంలో అమెరికా స్వయంగా భారత్ ను ప్రోత్సహించిందన్నారి గుర్తు చేశారు జైశంకర్.

# హైదరాబాద్‌కు రండి.. ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కి కేటీఆర్ ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది చివరలో భారత్‌లో మా మొదటి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో ఇండియాను సందర్శించనున్నట్లు తెలిపారు. దేశంలో ఏఐ వాడకం అద్భుతంగా ఉందని, గత సంవత్సరం నుంచి చాట్‌జీపీటీ వినియోగదారుల సంఖ్య ఏకంగా నాలుగు రెట్లు పెరిగిందని ప్రశంసించారు. ఈ మేరకు భారత్‌లో మరిన్ని పెట్టుడులు పెట్టడానికి మేము ఉత్సాహంగా ఉన్నామని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. దీనిపై ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. హదరాబాద్ నుంచి సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాలని సూచించారు. ఇండియాకి స్వాగతం అంటూ శనివారం ఎక్స్ వేదికగా కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ భారతదేశానికి సరైన ప్రవేశ ద్వారామని, ఓపెన్ ఏఐ వంటి సంస్థలకు ఈ నగరం అనువైన స్థావరం అని కేటీఆర్ రాసుకొచ్చారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఇన్నోవేషన్ వ్యవస్థ కలిగి ఉందని తెలిపారు. టీ హబ్, వీ హబ్, టీ వర్క్స్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ వంటి సంస్థలు ఉన్నాయని తెలిపారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, ఆపిల్, క్వాల్కమ్ లాంటి ప్రపంచ టెక్ దిగ్గజాలకు ప్రాధాన్యతనిచ్చే కేంద్రంగా ఉందన్నారు. వరుస ప్రభుత్వాలు తెలంగాణను భారతదేశ ఏఐ క్యాపిటల్ సిటీగా చేయడానికి సాహసోపేతమైన చర్యలు తీసుకున్నాయని వెల్లడించారు. 2020ని ఏఐ సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. ఓపెన్ ఏఐ కార్యకలాపాలకు ఎంతో అనుకూలంగా హైదరాబాద్ ఉంటుందని కేటీఆర్ ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# ఒక్కసారి ఆ తీర్పు చదివి ఉంటే బాగుండేది



**న్యూస్ డెస్క్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. సల్వాజుడం తీర్పు సుప్రీంకోర్టుదేనని, అది తన వ్యక్తిగత అభిప్రాయం కాదని అమిత్ షాకు కౌంటర్ ఇచ్చారు. ఆ తీర్పును తానే రాశా.. కానీ తీర్పు తన వ్యక్తిగతం కాదు. తీర్పు సుప్రీంకోర్టుదని అమిత్ షా వ్యాఖ్యలను తోసిపుచ్చారు.

ఈ తీర్పు వెలువరించే సమయంలో బెంచ్?పై నాతో పాటు మరో న్యాయమూర్తి కూడా ఉన్నారని గుర్తు చేశారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. అమిత్ షా తనపై ఆరోపణలు చేసే ముందు సల్వాజుడుం మొత్తం తీర్పును చదివి ఉంటే బాగుండేదని.. ఒకవేళ ఆయన తీర్పును చదివి ఉంటే బహుశా ఇలా మాట్లాడే వారు కాదని అన్నారు. ఏదైనా డిబేట్‌లో డీసెన్సీ అనేది ఉండాలని, అయితే ఈ విషయంలో హోం మంత్రితో తాను డిబేట్ చేయదలచుకోవడం లేదని స్పష్టం చేశారు.

అమిత్ షా ఏమన్నారంటే..?

ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పోటీకి దిగడంతో ఆయనపై అమిత్ షా సంచలన ఆరోపణలు చేశారు. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని ఆరోపించారు అమిత్ షా. 2011లో సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు సల్వాజుడుంపై తీర్పు ఇచ్చారని.. ఆయన ఆ తీర్పు ఇచ్చి ఉండకపోతే 2020 నాటికే దేశంలో మావోయిస్టు తీవ్రవాదం ముగిసి ఉండేదన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రెడ్డి నక్సల్ భావజాలం నుంచి స్ఫూర్తి పొందారు కాబట్టే అలాంటి తీర్పు వెలువరించారని సెన్సేషనల్ ఎలిగేషన్స్ చేశారు అమిత్ షా. ఓ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిపై అమిత్ షా ఇలాంటి ఆరోపణలు చేయడం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అసలు సల్వాజుడుం తీర్పు ఏంటి అని పలువురు ఇంటర్ నెట్లో వెతుకుతున్నారు.

# చిట్టి చేతులు - గట్టి సంకల్పం

**స్మార్ట్ కిడ్జ్ లో ఆకట్టుకున్న ఎకో ఫ్రెండ్లీ గణనాథుల తయారీ**

**మట్టి గణపయ్యలను తయారు చేసిన చిట్టి చేతులు**

**చైతన్య పరిచిన ఎకో ఫ్రెండ్లీ అవగాహన ర్యాలీ**



**ఖమ్మం టౌన్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం పాఠశాల చిన్నారులు తమ చిట్టి చేతులతో ఎకో ఫ్రెండ్లీ గణనాథులను తయారు చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ గణపయ్యాలనే పూజించాలని తెలియజేస్తూ చిన్నారులు ఉత్సాహంగా ఎకో ఫ్రెండ్లీ గణపతులను తయారు చేశారు.వివిధ రూపాలలో వినాయక ప్రతిమలను అందంగా రూపొందించారు. మట్టి గణపయ్యలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు రకాల కూరగాయలతో, పండ్లతో ,పూలతో ,దినుసులతో, బియ్యం, బిస్కెట్స్ , ఇడ్లీ, ఆకులు పలు రకాల ఆకృతులలో గణనాథులకు రూపం ఇచ్చారు.అనంతరం చిన్నారులు రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలతో నగరంలోని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపయ్యలనే పూజించాలని,పర్యావరణాన్ని రక్షించాలని, రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించకుండా పర్యావరణానికి రక్షణ కల్పించాలని కోరుతూ జరిపిన ర్యాలీ అందరిని విశేషంగా ఆకట్టుకుని, చైతన్యపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, భక్తులందరూ మట్టి వినాయకులతోనే గణేష్ వేడుకలను, పూజా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.పర్యావరణాన్ని, చెరువులను, నీటి వనరులను కాలుష్యరహితంగా ఉంచడానికి ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలకే పూజలు జరపాలని తెలియజేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా తమ పాఠశాలలో కాలుష్యరహిత పర్యావరణ రక్షణ కోసం ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలనే పూజించాలని అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులతోనే మట్టి గణపయ్యలు తయారు చేయడం జరిగిందని తెలిపారు గణేష్ వేడుకలను పర్యావరణహితంగా, ఆధ్యాత్మికంగా, కాలుష్య రహితంగా ప్రజలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం



**ఖమ్మం బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** సిపిఐ అగ్రనేత, పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి, సిపిఐ పార్టీకి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిందని పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మరణం వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులకు, దేశానికి తీరని లోటు అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి రాజకీయ నిబద్ధత క్రమశిక్షణ కలిగిన గొప్ప నాయకుడని, విద్యార్థి దశలో వామపక్ష సిద్ధాంతాలకు ఆకర్షితుడై కమ్యూనిస్టు పార్టీలో చేరాడని, అంచలంచలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఆయన బాధ్యతలు నిర్వహించాడని అన్నారు. ఈ సందర్భంలో అనేక ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేసి, ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. ప్రత్యేకించి చరిత్రాత్మకమైన విద్యుత్ పోరాటంలో, చలో అసెంబ్లీ కార్యక్రమంలో, బషీర్బాగ్‌లో జరిగిన కాల్పులు, లాఠీ దెబ్బలు, నిర్బంధాల సందర్భాలలో సుధాకర్ రెడ్డితో కలిసి తాను ప్రత్యక్షంగా పాల్గొన్న విషయాన్ని నున్నా నాగేశ్వరావు గుర్తు చేశారు.

## ఆయిల్ పామ్ సాగు పై మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్ బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సిద్ధిపేట ఆయిల్ పామ్ ప్యాక్టరీ ఒపెనింగ్ సంబంధించిన ఏర్పాట్లపై ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగ రాఘవ రెడ్డి తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో దాదాపు రూ.300 కోట్లతో ఆయిల్ పామ్ తయారీ పరిశ్రమ నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ప్రారంబోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ విస్తరణ పురోగతిని వేగవంతం చేయాలని ఆయిల్ ఫెడ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగుపై నెలవారీగా సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాఘునందన్ రావు,ఆర్టీకల్చర్ ఎండీ శ్రీమతి యాస్మీన్ భాషా ఐ.ఎ.ఎస్, ఆయిల్ ఫెడ్ ఎండి శంకరయ్య,ఒ.ఎస్.డి.కిరణ్ కుమార్, ఈడీ ప్రశాంత్ కుమార్, జనరల్ మెనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ మెనేజర్ శ్రీకాంత్ రెడ్డి, మెనేజర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, హెచ్.ఆర్. మెనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మట్టి గణపతితో పర్యావరణాన్ని కాపాడుదాం



**ఖమ్మం బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** విద్యార్థుల్లో అభిరుచి, ఆసక్తిని బట్టి ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి ప్రోత్సహించడమే బ్యాగ్ లెస్ డే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పిల్లలకు చదువుల ఒత్తిడిని తగ్గిస్తూ, ఏకాగ్రతను పెంచుతూ ఉల్లాసపూరిత వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. శనివారం, నెలలో నాలుగవ శనివారం నిర్వహించే బ్యాగ్ లెస్ డే కార్ర్యకమంలో భాగంగా స్థానిక ఇందిరనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు కాగితపు బొమ్మలు పూలతో కలిపి చేసిన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకడంతో కలెక్టర్ మురిసిపోయారు. పిల్లలు తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్స్, పోస్టర్ డిజైనింగ్, ఫజిల్స్ సాల్వింగ్, పేపర్ తో చేసిన పలు ఆకృతులను కలెక్టర్ తిలకించారు. నృత్యం, సంగీతం, పలు గీతాలు, గేయాలాపన, ప్రసంగాలు వంటి ప్రదర్శనలను ఆస్వాదించారు. ముఖ్యంగా మట్టి, పిండితో వినాయక విగ్రహాలు తయారు చేసిన విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులపై పుస్తకాలు, హెూంవర్క్ బరువును తగ్గించి, ఆటపాటలు, క్రీడలు, కళలు, పర్యావరణ పరిరక్షణ అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు వీలు కల్పించడం, చదువులపై ఏకాగ్రత పెంచడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు తమ బరువైన బ్యాగులను నెలలో ఒక్కసారైనా పాఠశాలలకు తీసుకెళ్లకుండా ఆనందాన్ని కలిగించేందుకు వీలును బట్టి మ్యూజియం, చారిత్రక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల సందర్శన, సైన్స్ ప్రయోగాలు, విద్యపై స్కిట్, పతంగుల తయారీ, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గణిత కార్నర్, రంగోలి, మోడల్ ఎన్నికలు, మాక్ అసెంబ్లీ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, బేస్డ్ లెర్నింగ్, ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి విద్యార్థులకు అవకాశం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ ఉత్తమ రచనలను కళాత్మక రూపంలో ప్రదర్శించడానికి ఆసక్తిగా పాల్గొంటారని, సెలవుదినానికి ముందు రోజు విద్యార్థులు సంతోషంగా ఉండటం చాలా బాగుంటుందని అన్నారు. సమూహంగా నైపుణ్య కార్యకలాపాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు కలుగుతుందని తెలిపారు. ప్రతి నెలలో నాలుగో శనివారం జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో బ్యాగ్ లెస్ డే గా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పండుగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా వినాయక చవితి పండుగ రోజున మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కన పెట్టి, పర్యావరణ హిత మట్టి గణపతులకు ప్రాధాన్యమిద్దామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. కలెక్టర్ సందర్శన సమయంలో ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.



# పేద ప్రజల యుగస్వరం సురవరం

## ● సంతాపసభలో జితేందర్రెడ్డి ● సుధాకర్ రెడ్డికి ఘననివాళి



**ఖమ్మం బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** దేశవ్యాపితంగా పేద, కార్మిక వర్గాల గొంతుకగా చట్టసభలలో బయట తనగళాన్ని వాణిని వినిపించిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజల యుగస్వరమని సి.పి.ఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తెలిపారు. బాల్యంలోనే తిరుగుబాటు పంధాను అవలంభించిన సుధాకర్రెడ్డి కడవరకు అదే పంధాను కొనసాగించారని ఆయన తెలిపారు. శుక్రవారం మరణించిన సి.పి.ఐ జాతీయ నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్రెడ్డి సంతాపసభ శనివారం స్థానిక సి.పి.ఐ కార్యాలయం గిరిప్రసాద్భవన్లో జరిగింది. సురవరం చిత్రపటానికి సి.పి.ఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శింగునర్సింహారావు అధ్యక్షతన జరిగిన సభలో జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాపితంగా విద్యార్థి, యువజన ఉద్యమాలను నిర్మించారని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టుపార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శిగా ప్రారంభమైన ఆయన జీవితం రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శివరకు సాగిందన్నారు. సురవరం గొంతుక ప్రజల గొంతుకగా పనిచేసిందని ఇటీవల కాలంలో భారత పార్లమెంటరీ వ్యవస్థలో గొప్ప అంశాలుగా చెప్పుకునే 18 సంవత్సరాలకే ఓటు హక్కు సమాచార హక్కుచట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సాధనలో సురవరం కీలక భూమిక పోషించారన్నారు. మార్క్సిస్టు మేధావిగా పేరుగడించిన ఆయన తుది శ్వాసవరకు కమ్యూనిస్టుల ఐక్యతకోసం పరితపించారని జితేందర్రెడ్డి తెలిపారు. సాంప్రదాయ కమ్యూనిస్టుపార్టీ కుటుంబం నుంచి ఉద్యమ వారసత్వాన్ని స్వీకరించిన సురవరం భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఎందరికో ఆదర్శంగా నిలిచారని ఆయన తెలిపారు. సురవరం ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయడమే మనము అయనకు ఇచ్చేవాళీ అని జితేందర్రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాతో సురవరానికి ప్రత్యేక అనుబంధం ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ సభలో సి.పి.ఐ రాష్ట్ర సమితిసభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గసభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పుచ్చకాయల కమలాకర్, వై.సాంబశివరెడ్డి, కూచిపుడ్డి రవి జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదనర్సింహారావు, ఎస్.కె. సైదా తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి విడుదల చేయకుంటే బిఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుంది

## ఎస్ఎఫ్ఐమాజీ నాయకులు వై విక్రమ్



**ఖమ్మం టౌన్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫీజుల దీక్ష కార్యక్రమాన్ని స్థానిక ఖమ్మం నగర కేంద్రంలోని ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వై విక్రమ్ పాల్గొని దీక్ష కార్యక్రమాన్ని పూలదండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని పెండింగ్ స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్స్ ఇవ్వకుండా గత ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసింది నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కూడా అదే పోకడలు పోతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతుంది ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు విడుదల చేయకుంటే రాష్ట్ర ముఖ్యమంత్రిని సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ దశలవారీగా జిల్లా కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా పెండింగ్ బకాయిల విడుదల కోసం పోరాటాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని మంత్రులను కలిసిన ప్రయోజనం లేకుండా పోతుంది తక్షణమే వీళ్ళు స్పందించి విద్యారంగానికి ఇవ్వాల్సినటువంటి నిధులను విడుదల చేయకుంటే జిల్లాలో ముగ్గురు మంత్రులను సైతం అడ్డుకుంటామని తెలియజేశారు. గత ఏడు నెలల నుండి జనరల్ హాస్టల్స్ కు మెస్ కాస్మోటిక్ చార్జీలను కూడా పెండింగ్లో ఉన్నాయని తక్షణమే వాటిని విడుదల చేయాలన్నారు. 5000 మందికి పైగా విద్యార్థులు చదువుకునే ఎస్సార్ అండ్ బిజీ ఎన్ ఆర్ డిగ్రీ కళాశాలకు అదనపు తరగతి గదులను నిర్మించాలని తెలియజేశారు. సెల్ఫ్ మేనేజ్మెంట్ కోర్సుల పేర్లతో పీజీ కోర్సులు అయిపోయిన విద్యార్థుల నుండి సగం ఫీజును వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలని అన్నారు.కార్యక్రమానికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ చేసే ప్రతి పోరాటంలో సిఐటియు మద్దతు ఉంటుందని విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేయాలని తెలియజేశారు. దీక్ష శిబిరానికి మద్దతు తెలియజేసిన ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సిఐటియు జిల్లా నాయకులు ఎంఏ జబ్బార్ , జార్జి రెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు సురేష్ పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నాగుల్ మీరా ఇతర నాయకత్వం మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు జిల్లా కమిటీ సభ్యులు ఉమేష్, వరుణ్, హరీష్ , సింధు నాయకులు త్రినాథ్, లోకేష్, సుశాంత్, సాత్వీక, సింధు, శ్రీలత, అఖిల, శ్రావ్య, శరణ్య హారిక, పూజిత, సింధు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యునిగా బాగం

## కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా

## కార్యవర్గసభ్యులు దండి సురేష్, జితేందర్రెడ్డి



**ఖమ్మం బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** భారత కమ్యూనిస్టుపార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శివర్గసభ్యునిగా జిల్లాకు చెందిన బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. మూడు రోజులపాటు మేడ్చేల్ జిల్లా గాజుల రామవరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. నేలకొండపల్లి మండలం మూటాపురంలో రైతు కుటుంబంలోజన్మించిన బాగం హేమంతరావు విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. ఎ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి, ఎ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన ఆయన సుదీర్ఘకాలం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా విభజన అనంతరం అవశేష ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, డి.సి.సి.బి. ఉపాధ్యక్షులుగా పనిచేశారు. మూటాపురంపె.ఎ.సి.ఎస్. అధ్యక్షునిగా పనిచేస్తున్న బాగం హేమంతరావు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, సి.పి.ఐజాతీయ సభ్యునిగా కొనసాగుతూ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యునిగా ఎన్నికయ్యారు.

ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ మౌలానా అత్యంత కీలకమైన సి.పి.ఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ ఛైర్మెన్గా ఎన్నికయ్యారు. సీనియర్ కమ్యూనిస్టుగా జిల్లాకు చిర పరిచితులైన మౌలానా ఛైర్మెన్ ఎన్నిక కవాడం ఇది రెండోసారి.

సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సమితి సభ్యులుగా యర్రాబాబు, ఏపూరి లతాదేవి, ఎస్.కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ఆహ్వానితులుగా అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, బి.జి.క్లెమెంట్లు ఎన్నికయ్యారు.

# డిప్యూటీ సిఎం భట్టి చొరవతో రహదారులకు మోక్షం







**హైదరాబాద్ బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** భట్టి విక్రమార్క కృషితో చింతకాని మండలంలో రహదారుల అభివృద్ధికి 100 కోట్ల నిధులు కేటాయించబడి, పలు రహదారులు బీటీ నిర్మాణం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి, మరికొన్ని రహదారుల పనులు బీటి నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చింతకాని మండలం పరిధిలో ప్రజల సౌకర్యార్థం పలు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ పనులు ఒకదానికొకటి నెమ్మదిగా పూర్తవుతున్నాయి. సుమారు రూ.100 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ రహదారులు బిటి రోడ్డు నిర్మాణం పూర్తయి మరికొన్ని రహదారులు బీటి నిర్మాణం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాయి.

**రోడ్ల జాబితా - మంజూరైన నిధులు...**

బోప్పారంనుండి గాంధీనగర్ కాలనీ వరకు - రూ.1.75 కోట్లు, నాగులవంచ నుండి తిమ్మినెనిపాలెం వరకు - రూ.6.75 కోట్లు, నాగులవంచ నుండి తిమ్మినెనిపాలెం-తిర్లాపురం క్రాస్ రోడ్ వరకు - రూ.3.50 కోట్లు, తిమ్మినెనిపాలెం నుండి పొలంపల్లి, చిన్నమండవ వరకు - రూ.9.00 కోట్లు, ప్రొద్దుటూరు నుండి పాతర్లపాడు వరకు - రూ.7.00 కోట్లు, పాతర్లపాడు నుండి గోవిందాపురం వరకు - రూ.6.20 కోట్లు, రఘువాపురం నుండి అల్లిపురం వరకు - రూ. 2.00 కోట్లు, రఘువాపురం నుండి లచ్చగూడెం వరకు - రూ.2.80 కోట్లు, నాగిలిగొండ నుండి కొండవనమాల వరకు - రూ.4.50 కోట్లు, వందనం నుండి పుట్టకోట వరకు - రూ.4.00 కోట్లు,నాగిలిగొండ నుండి గొల్లెనపాడు వరకు - రూ.7.10 కోట్లు, రేపల్లెవాడ నుండి నేరడ వరకు - రూ.5.60 కోట్లు, రఘువాపురం నుండి లచ్చగూడెం స్టేడియం వరకు- రూ.3.20 కోట్లు, రేపల్లేవాడ నుండి లక్ష్మీపురం వరకు - రూ.6.80 కోట్లు, రేపల్లేవాడ నుండి ఎన్ ఎస్ పి కెనాల్ వరకు - రూ.2.70 కోట్లు నాగులవంచ నుండి పొలంపల్లి వరకు - రూ.5.50 కోట్లు, పందిళ్ళపల్లి నుండి మత్కేపల్లి వరకు - రూ.8.50 కోట్లు, ఆర్, బీ రోడ్ నుండి జగనాధపురం వరకు -రూ.1.00 కోటి, ఆర్, బీ రోడ్ వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి రేపల్లవాడ వరకు - రూ.1.00 కోటి, నాగులవంచ నుండి చింతకాని వరకు %-% రూ.5.40 కోట్లు ,మొత్తం అంచనా వ్యయం: రూ.94.30 కోట్లు, ,మరియు ఎస్సీ సబ్ ప్లాన్ నుండి చింతకాని మండలంలోని గ్రామాల ఎస్సీ కాలనీలకు రూ.4 కోట్ల రూపాయలు. చింతకాని మండల పరిధిలో గత ప్రభుత్వంలో రహదారులు అభివృద్ధి చెందక, వర్షం వచ్చినప్పుడు బురదమయంగా మారి, రైతులు మరియు కూలీలు వ్యవసాయ పనులకెళ్లే టప్పుడు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చేది. గ్రామాల మధ్య రాకపోకలు అస్తవ్యస్తంగా ఉండేవి, వీటిని తన పాదయాత్రలో గమనించిన భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పల్లె రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగింది.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క కృషితో పల్లె రోడ్ల పరిస్థితి మెరుగుపడింది. చింతకాని మండలంలోని పలు రహదారుల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్ల నిధులు కేటాయించబడి, పలు రహదారులు బీటీ నిర్మాణం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరికొన్ని రహదారుల పనులు బీటి నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయి. పల్లె డొంక రోడ్లను బీటీ రోడ్ల గా మార్చడానికి కృషి చేసిన భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వివిధ గ్రామాల రైతులు మరియు ప్రజలు.

## త్రివేణి లో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



**ఖమ్మం ఎడ్యుకేషన్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 విజయవంతమైన సందర్భంగా భారత ప్రభుత్వము ప్రతి సంవత్సరం ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవం గా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు దేశం అంతటా అంతరిక్ష దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో విద్యార్థులకు అంతరిక్ష దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, పోటీలను నిర్వహించడం జరిగింది. విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తమ సందేశంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ-ఇస్రో ప్రపంచంలోనే అత్యంత ప్రముఖమైన సంస్థగా ఎదిగిందని సుమారు 104 ఉపగ్రహాలను ఒకేసారి అంతరిక్షంలోకి ప్రవేశపెట్టగలిగేంత గొప్ప సంస్థగా ఎదిగిందని కొనియాడారు చంద్రయాన్ 3 విజయవంతం అవడంతో ప్రపంచంలోనే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అత్యుత్తమ సంస్థగా గుర్తింపబడిందని ఆయన కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద వ్యవస్థగా ఎదిగిందని దీనితో భారత ప్రజల అందరూ ప్రపంచం ముందు అత్యంత గర్వోత్సాహాలతో తలెత్తుకు నిలబడినారని అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇన్చార్జి చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## కాంగ్రెస్ నేత వడ్డెబోయిన



**ఖమ్మం టౌన్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** పేద ప్రజల సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు అన్నారు. ఖమ్మం నగరంలోని 25వ డివిజన్ రిక్కా బజారుకు చెందిన నెల్లుట్ల ఆనంద్ 36,000, పాకబండ బజారుకు చెందిన రామదాసు శ్రీధర్ కి 60,000 రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు మరియు ఎంపీ కార్యాలయ ఇన్చార్జ్ కొప్పుల చంద్రశేఖర్ లబ్ధిదారులకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామరెడ్డి సిఫారసుతో చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేసినారని తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కడుబేదవాళ్లు పేద ప్రజలు చేసుకోలేని పరిస్థితులలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వంలో చికిత్సకు నోచుకుంటున్నారని అన్నారు. ఈ యొక్క గంత కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు దాసరి పూర్ణ, నగర కాంగ్రెస్ నాయకులు బండారు శ్రీను, డివిజన్ కాంగ్రెస్ నాయకులు రాకుండే కృష్ణ, గార్ల వెంకన్న, అనిశెట్టి గిరి, తదితరులు పాల్గొన్నారు.

## సూరవరం మృతికి ఎం ఎల్ సి తాతా మధు సంతాపం



**ఖమ్మం బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ లోక్‌సభ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ సంతాపం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య విలువలకు అంకితభావంతో, సామాజిక న్యాయ సాధనకు తన జీవితాన్ని అర్పించిన గొప్ప కమ్యూనిస్టు యోధుడిని దేశం కోల్పోయిందని, విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల దాకా ఆయన చేసిన ప్రయాణం ప్రజాసేవకు మార్గదర్శకం, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు ఎంపీగా సేవలందించిన ఆయన, పార్లమెంటరీ వ్యవస్థలో విలువలతో కూడిన రాజకీయానికి ప్రతినిధిగా నిలిచాయని తన సంతాప సందేశంలో ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఆయన నిర్వహించిన బాధ్యతలు, వామపక్ష ఐక్యతకు చేసిన కృషి చిరస్మరణీయమైనవి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఆయన ప్రకటించిన మద్దతు, ప్రజల పట్ల ఆయనకు ఉన్న అనురాగం, సామాజిక సమస్యలపై ఆయన చూపిన చైతన్యం, నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయి అని అన్నారు. ఈ విషాద సమయంలో సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటు, వారి కుటుంబ సభ్యులకు, సీపీఐ నాయకత్వానికి, కార్యకర్తలకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సిపిఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి

## మాజీ ఎంపీ నామ సంతాపం



**ఖమ్మం బ్యూరో, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** సిపిఐ దిగ్గజ నేత, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెండుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికైన ఆయన ప్రజా సమస్యలపై ధైర్యంగా పోరాడారని కొనియాడారు. ప్రజల కోసం ఎల్లప్పుడూ నిబద్ధతతో పనిచేసి, దశాబ్దాలపాటు సిపిఐలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన నీతి, నిజాయితీ, త్యాగస్ఫూర్తి అందరికీ ఆదర్శమని, పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడి, నిరాడంబరంగా జీవించారని గుర్తుచేశారు. స్వాతంత్ర సమరయోధుడు వెంకట్రామిరెడ్డి కుమారుడిగా తెలుగు ప్రజలకు గౌరవం తెచ్చారని, సిపిఐలో క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఆయన ప్రసంగాలు మేధావులను ఆకట్టుకోవడమే కాకుండా, ఆయన ఆలోచనలు కొత్త తరాలకు మార్గదర్శకమని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా తెలుగు ప్రజలకు కూడా తీరని లోటు అని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## బిల్డింగ్ నిర్మాణ పనులను పర్యవేక్షణ సమయంలో పై నుండి ఐరన్ పైపు తలకు గాయం చికిత్స పొందుతూ మరణం



**కుత్బుల్లాపూర్, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో 22.08.2025 రోజున శివకుమార్ తండ్రి రామ్ ఆవుతర్ చిరునామా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అనే వ్యక్తి సూరారం పోలీస్ స్టేషన్ లో చేసిన ఫిర్యాదు ఏమనగా అతని కజిన్ బ్రదర్ అయిన అరవింద్ కుమార్ తండ్రి భగీరథీ లేట్, వయస్సు 22 సంవత్సరములు గల అతను తన స్వస్థలం అయిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం నుండి ఒక సంవత్సరం క్రితం జీవనోపాధి కోసం సూరారం విలేజ్ కి వచ్చి బిల్డింగ్ నిర్మాణ పనుల సూపర్వైజర్ గా మల్లారెడ్డి హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్నాడు. తేదీ 21-08-2025 నాడు అందాజా మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న గర్ల్స్ హాస్టల్ బిల్డింగ్ వెనకాల కొత్తగా నిర్మిస్తున్న మరొక గర్ల్స్ హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం పనులను పర్యవేక్షిస్తున్న సమయంలో అతనిపై ఆకస్మాత్తుగా నాలుగవ అంతస్తు నుండి ఒక పెద్ద కాంక్రీట్ ఐరన్ పైపు పైనుండి జారి కింద పడి అతనికి తగలడంతో అతని తలకు తీవ్రమైన రక్త గాయమై అక్కడే పడిపోగా వెంటనే అతనేని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా చికిత్స పొందుతూ తేదీ. 22-08-2025 నాడు అందాజా ఉదయం అందాజా 5 గంటల సమయంలో అరవింద్ కుమార్ చనిపోయినాడు. ఇట్టి సంఘటనలో బిల్డింగ్ కాంట్రాక్టర్ మల్లారెడ్డి ఆసుపత్రి యాజమాన్యం వారు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవటం వల్ల అరవింద్ కుమార్, మృతి చెందినాడు. ఇట్టి విషయం పై సూరారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి మృతుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి పంపించి దహార్యాప్తు చేపట్టడం జరిగినది.

## ట్రాన్స్ ఫార్మర్ల లో రాగి దొంగిలించి అమ్ముతున్న 6 గురు వ్యక్తులు అరెస్టు



**ఖమ్మం, 23 ఆగష్టు (కెరటం న్యూస్):** రఘునాథ పాలెం మండలం మరియు అర్బన్ పోలీసు స్టేషన్ లో పలు దొంగతనాల్లో నిందితులుగా, ఉన్న ఆరు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు. రైతుల పంట పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్లను దొంగిలించి, అందులో ఉన్న కాపర్ ని తీసి అమ్ముతున్న ముఠా సభ్యులు. వారి వద్ద నుండి 100 కేజీల రాగి, 20, 000 రూపాయల నగదు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథ పాలెం సీ.ఐ ఉస్మాన్ షరీఫ్ ఎస్సై నరేష్, ఎస్సై తేజేశ్వర్ రెడ్డి, సిబ్బంది రాజు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.